

వలస గోస తీరేలా..
గల్ఫ్ కార్మికులు, వారి కుటుంబీకులకు ఎట్టకేలకు భరోసా లభించింది. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. 8లో▸



కడెం నీళ్లు.. కడలిపాలు
నిర్మల్ జిల్లా సాగునీటి ప్రాజెక్టుల్లో కీలకమైన జలాశయం కడెం. ఈ ప్రాజెక్టు సామర్థ్యం తక్కువగా ఉండడంతో ఏటా లక్షల క్యూసెక్కుల నీరు వృథాగా పోతోంది. 10లో▸

గరిష్టం/కనిష్టం
31.1 /24.2
వాతావరణం
ఆకాశం దాదాపు పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఆ పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలి

- ఆర్జేడీ ఆదేశాలు


జైల్లో సార్లు.. బడులకు తాళాలు
మూతబడ్డ గంగాపూర్ పాఠశాల
కడెం: నిర్మల్ జిల్లాలో క్రిప్టో కరెన్సీ, కాయిన్ దం దాలు చేసిన ప్రభుత్వ ఉపాధ్యాయులు అ రెస్ట్ అ

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

సాక్షి స్పందన

కడెం: మండలంలోని గంగాపూర్, మొర్రిగూడెం పాఠశాలల ఉపాధ్యాయులు క్రిప్టో కరెన్సీ కేసులో ఇటీవలే అరెస్ట్ కాగా, అధికారులు వారిస్థానంలో ప్రత్యామ్నాయ ఉపాధ్యాయులను నియమించలేదు. ఈవిషయమై 'జైల్లో సార్లు..బడులకు తాళాలు' శీర్షిక న ఈనెల 18న, 'సాక్షి'లో వచ్చిన కథనానికి రీజినల్ జాయింట్ డైరెక్టర్ స్పందించారు. గంగాపూర్, మొర్రిగూడెం పాఠశాలలకు వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని డీఈవో రవీందర్‌రెడ్డిని ఆదేశించారు.

అడవులను పరిరక్షించాలి


ఫైబర్ లైన్ పనులను పరిశీలిస్తున్న నాగిని భాను

కుంటాల: అడవుల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని డీఎఫ్‌వో నాగిని భాను సూచించారు. మండలంలోని దౌనెల్లిలో కొనసాగుతున్న ఫైబర్ టవర్ లైన్ పనులను గురువారం పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన మేరకు పనులు చేయాలన్నారు. వారివెంట ఎఫ్ఆర్వో శంకర్, ఎఫ్ఎస్‌వో కీర్తి, ఎఫ్‌బీవోలు ముస్తాక్, హరిలత ఉన్నారు.

పది వేల ఎకరాలకు సాగునీరు


నీటిని విడుదల చేస్తున్న రామారావుపటేల్

భైంసాటౌన్: గడ్డెన్న వాగు ప్రాజెక్టు నుంచి పదివేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ తెలిపారు. ప్రాజెక్టు అధికారులతో కలిసి ప్రధాన కాలువ ద్వారా పంటలకు సాగునీటిని గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో పంటల సాగు కోసం నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. వచ్చే రబీ సీజన్‌లోనూ పది వేల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. కాలువ మరమ్మతులు, ఇతరత్రా పనులకు ప్రభుత్వం నుంచి నిధుల విడుదలకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డీఈఈ అనిల్, ఏఈ శ్రీకాంత్, మాజీ ఎంపీపీ అబ్దుల్ రజాక్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మల్లేశ్, సీనియర్ నాయకులు భీంరావు, రమేశ్, రావుల పోశెట్టి, దిలీప్, వడ్నప్ శ్రీనివాస్, ప్రవీణ్, రాము, తానూర్ మండల నాయకుడు శివాజీపటేల్ పాల్గొన్నారు.

వందశాతం అక్షరాస్యతకు చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో వంద శాతం అక్షరాస్యత సాధించేలా చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశం మందిరంలో వయోజనవిద్య శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమం అమలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలన్నారు. ప్రస్తుతం 57.77 శాతం అక్షరాస్యతతో జిల్లా రాష్ట్రంలో 27వ స్థానంలో ఉందని తెలిపారు. జిల్లాలో 13,563 మందిని నిరక్షరాస్యులుగా గుర్తించామని పేర్కొన్నారు. అక్షరాస్యతతోపాటు ఆర్థిక అక్షరాస్యత, వాణిజ్య నైపుణ్యాలు, ఆరోగ్య సంరక్షణ, అవగాహన, శిశు సంరక్షణ, విద్య, కుటుంబ సంక్షేమం, సమాజ శ్రేయస్సు, పర్యావరణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. వృత్తి నైపుణ్యాలు, సంపాదన, జీవన పరిస్థితులను మెరుగుపరచడానికి సంబంధిత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. విద్య, వైద్య పంచాయతీ, ఆరోగ్యశాఖ ఎంపీడీవోలు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో గోవింద్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, డీపీవో శ్రీనివాస్, లైజన్ అధికారి బీఎస్.మూర్తి, మున్సిపల్ కమిషనర్ రాజు, మెప్మా పీడీ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ లేని లిఫ్ట్!

- రూ.750 కోట్లతో నిర్మాణం
- గతేడాది ప్రారంభించిన నాటి మంత్రులు
- ఆ సమయంలో తాత్కాలిక విద్యుత్..
- కోట్లు వెచ్చించినా ఎత్తిపోయని వైనం
- బీడు భూములను తడపని గోదావరి!


గుండంపల్లి శివారులో గోదావరి వద్ద ఎత్తిపోతల పథకం


డెలివరి సిస్టర్న్



భైంసా: గోదావరి నీటిని బీడు భూములకు మళ్లించాలన్న సంకల్పంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 2008లో ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌ను ఎత్తిపోసేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. అయితే ఆయన మరణం.. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో అది ఆగిపోయింది. ఇక, తెలంగాణ వచ్చాక, బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చింది. ప్రాజెక్టులో భాగంగా ప్యాకేజీ 27 కింద జిల్లాలో ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టారు. గతేడాది పనులు పూర్తయ్యాయి. దీంతో అప్పటి ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, దేవాదాయ, అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ఇందు కోసం చుట్టుపక్కల గ్రామాలకు విద్యుత్ సరఫరా మొత్తం నిలిపివేసి.. లిఫ్ట్ మోటార్లు నడిచేలా తాత్కాలికంగా విద్యుత్ సరఫరా చేశారు. పథకం ప్రారంభంతో గోదావరి నీటితో తమ భూములు సస్యశ్యామలం అవుతాయని సంతోషపడ్డారు. కానీ, ప్రారంభించిన రోజు మినహా ఇప్పటి వరకు మోటార్ నడవలేదు. చుక్క నీరు లిఫ్ట్ చేయలేదు.

కోట్ల రూపాయలు వెచ్చించి...
కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రూ.714 కోట్లతో ప్యాకేజీ 27 పనులు చేపట్టారు. దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి వద్ద గోదావరిలో పంప్‌హౌస్ నిర్మించారు. ఇక్కడి నుంచే మాటేగాం గుట్ట వద్ద నిర్మించిన డెలవరీ సిస్టర్న్ వద్దకు ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్‌ను ఎత్తిపోసేలా పైపులైన్ నిర్మాణాలు చేపట్టారు. ఈ కుండీ నుంచి రెండు ప్రధాన కాలువలు నిర్మించారు. కుడి కాలువను నిర్మల్‌వైపు 13.50 కిలోమీటర్ల మేర పొడవుతో 100 క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మించారు. ఎడుమ కాలువను కుంటాలవైపు 29.50 కిలోమీటర్ల పొడవుతో 140 క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మించారు.

50 వేల ఎకరాలకు నీరందేలా..
జిల్లాలోని దిలావర్‌పూర్, నర్సాపూర్(జీ), కుంటాల, సారంగాపూర్, నిర్మల్, లక్ష్మణచాంద, సోన్, మామడ మండలాల పరిధిలోని చెరువులు, కుంటలకు నీరందేలా కాలువలు నిర్మించారు. ప్యాకేజీ 27గా నిర్మించిన ఈ పథకానికి లక్ష్మీనరసింహస్వామి ఎత్తిపోతల పథకంగా నామకరణం చేశారు. గతేడాది అక్టోబర్ 5న అప్పటి మంత్రులు కేటీఆర్, ఇంద్రకరణ్‌రెడ్డి ప్రారంభించారు. రైతుల పంట భూములకు నీరు అందుతుందని ప్రకటించారు.

ఇప్పటికైనా తేరుకుంటే...
మరో రెండు నెలల్లో యాసంగి పంటకాలం ప్రారంభంకానుంది. ఈయేడు భారీ వర్షాలు కురిసి ఎస్సారెస్పీ నిండుకుండను తలపిస్తోంది. ఈ యాసంగిలో అయినా లక్ష్మీనరసింహా ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని లిఫ్ట్ చేసి 50 వేల ఎకరాలకు సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈమేరకు ఇప్పటి నుంచే కాలువల్లో పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించే పనులు చేపట్టాలని సూచిస్తున్నారు.

కాలువల్లో పిచ్చి మొక్కలు..


కుంటాల మండలంలో నీరుపారని కాలువ

గతేడాది అక్టోబర్‌లో ప్రారంభమైన లక్ష్మీనరసింహస్వామి ఎత్తిపోతల పథకం జిల్లా రైతులకు నీరందించడంలేదు. 50 వేల ఎకరాలకు నీరందించేలా కాలువలు నిర్మించారు. గత యాసంగిలోగానీ, ప్రస్తుత వానాకాలంలోగానీ ఒక్క ఎకరాకు కూడా నీరందించలేదు. దీంతో ప్రాజెక్టు ఎందుకు నిర్మించారని రైతులు ప్రశ్నిస్తున్నారు. తలాపునే గోదావరి పారుతున్నా.. తమ భూములు బీడుగానే ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కాలువలు పిచ్చిమొక్కలు మొలిచి అధ్వానంగా మారాయి. కాలువకు ఇరువైపుల గడ్డిజాతి మొక్కలు, ముళ్లకంపలు పెరిగాయి. ఇక అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడం లేదు.

కరెంటు కనెక్షన్ లేక...
లక్ష్మీనరసింహ ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తయినా కరెంటు కనెక్షన్ తీసుకోలేదు. గతేడాది అప్పటి ప్రభుత్వం ఎన్నికల్లో హడావుడి చేసి ఒకరోజు కోసం సమీప సబ్‌స్టేషన్ నుంచి ఇతర సరఫరాను నిలిపివేసి ఎత్తిపోతల పథకానికి కరెంటు అందేలా చూశారు. అప్పటి మంత్రులు వచ్చి ప్రారంభం చేసి వెళ్లగానే కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఏడాదైనా ఇప్పటికీ ఈ పథకానికి కరెంటు అందించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మరోవైపు ప్రధాన కాలువలు తవ్వినా ఉపకాలువలు నిర్మించలేదు. చాలా చోట్ల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీంతో ఎత్తిపోతల పథకం నీరందివ్వడం లేదు.

నీళ్ల కోసం ఎదురుచూస్తున్నాం



2008 నుంచి నీళ్లువస్తాయని చెబుతున్నారు. కాలువలు తవ్వి సీసీ నిర్మాణాలు చేపట్టారు. ఆ కాలువలన్నీ తుంగ, ముళ్ల చెట్లు పెరిగి పనికిరాకుండా పోతున్నాయి. ఈ కాలువల్లో నీళ్లు ఎప్పుడు పారతాయో అర్థం కావడం లేదు. ఈ యాసంగిలో అయినా కాలువల ద్వారా భూములకు సాగునీరందించాలి.
– సిందే దేవురావుపటేల్, విట్టాపూర్ రైతు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- కలెక్టర్ అభిలాష అభినవ్


గర్భిణులకు సీమంతం చేస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పోషణ్ అభియాన్ కార్యక్రమంలో తల్లి, బిడ్డలకు సంపూర్ణ పోషకాహారాన్ని అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. పట్టణంలోని టీఎన్జీవోస్ సంఘ భవనంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన జాతీయ పోషణ్ అభియాన్ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది ప్రదర్శించిన పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను కలెక్టర్, అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి పోషణ, పోషకాహారం, శుద్ధమైన తాగునీరు, పరిశుభ్రతపై వివరించాలన్నారు. జిల్లాలోని 926 అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ అభియాన్ కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని సూచించారు. అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది సమన్వయంతో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, పోషణ, ఆరోగ్య శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. పోషణలోపం ఉన్న పిల్లలను గుర్తించి పోషకాహారం అందించాలన్నారు. అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారి ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, అంగన్‌వాడీ, వైద్య శాఖ సిబ్బందితో కలెక్టర్ పోషణ అభియాన్ కార్యక్రమం అమలుపై ప్రతిజ్ఞ చేయించారు. గర్భిణులకు సీమంతం చేశారు. సీడీపీవో నాగలక్ష్మి, వైద్యులు నయన రెడ్డి, సౌమ్య, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అధికారులు, కౌన్సిలర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, మహిళలు పాల్గొన్నారు.

అటూ.. ఇటు

- మార్కెటింగ్ శాఖలో కుర్చీ ఆట
- ఇటీవలే ఉమ్మడి జిల్లా నుంచి ఇన్‌చార్జి డీఎంవోల బదిలీలు
- ఇక్కడ ఖాళీలు ఏర్పడడంతో తిరిగి సర్దుబాటు
- ఖరీఫ్ పంటల కొనుగోలు కోసం అరేంజ్‌మెంట్స్..


ఆదిలాబాద్ జిల్లా మార్కెటింగ్ కార్యాలయం

సాక్షి, ఆదిలాబాద్: మార్కెటింగ్ శాఖలో కొద్ది రోజులుగా కుర్చీ ఆట కొనసాగుతోంది. ఇటీవలే ఉమ్మడి జిల్లా నుంచి ఇన్‌చార్జి డీఎంవోలను నిజామాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. దీంతో ఇక్కడ ఖాళీలు ఏర్పడ్డాయి. ఖరీఫ్ పంటల కొనుగోలు సమీపిస్తుండగా రైతులకు, జిల్లా యంత్రాంగానికి అసౌకర్యం కలగకుండా వర్కింగ్ అరెంజ్‌మెంట్స్ (పని ఏర్పాట్లు) పేరిట ఇక్కడి నుంచి వేరే జిల్లాలకు వెళ్లిన వారిని తిరిగి ఇదే ఉమ్మడి జిల్లాలో అటు.. ఇటు మారుస్తూ సర్దుబాటు చేశారు. జిల్లాల విభజన సమయంలో ఉమ్మడి జిల్లాలో ఉద్యోగుల సర్దుబాటు జరిగింది.

ఇటీవలే బదిలీలు..
ఉమ్మడి జిల్లాలో ఈ శాఖ పరంగా అసిస్టెంట్ డైరెక్టర్ హోదా కలిగిన ఏకైక అధికారి టి.శ్రీనివాస్ రెగ్యులర్‌గా నిర్మల్ డీఎంవోగా కొనసాగుతూ ఆదిలాబాద్‌లో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తూ వచ్చారు. ఇటీవల ఈ శాఖలో బదిలీలు జరగడంతో ఆయన తిరిగి నిర్మల్ జిల్లాకు రెగ్యులర్ డీఎంవోగా నియమితులయ్యారు. ఇక నిర్మల్‌లో ఇన్‌చార్జి డీఎంవోగా కొనసాగిన సీనియర్ అసిస్టెంట్ హోదా కలిగిన సయ్యద్ అశ్వాక్ అహ్మద్, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ ఇన్‌చార్జి డీఎంవోగా కొనసాగిన సీనియర్ మార్కెటింగ్ అసిస్టెంట్ హోదా కలిగిన వై.గజానంద్‌ను నిజామాబాద్ డీఎంవో కార్యాలయాలకు ఇటీవల బదిలీ చేశారు. దీంతో ఆదిలాబాద్, మంచిర్యాల, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో డీఎంవో పోస్టుల ఖాళీ అయ్యాయి.

సర్దుబాటు..
ప్రస్తుతం ఖరీఫ్ పంటలు సాగవుతున్నాయి. మరో నెలరోజులు దాటితే పంటల కొనుగోలు సీజన్ మొదలవుతుంది. ఆ సమయంలో మార్కెటింగ్ అధికారుల పాత్ర కీలకం. ఈ పోస్టులు ఖాళీగా ఉంటే ఇటు రైతులకు, అటు జిల్లా యంత్రాంగానికి అసౌకర్యం ఏర్పడే పరిస్థితులు తలెత్తుతాయి. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ శాఖ అప్రమత్తమైంది. ఆ శాఖ డైరెక్టర్ నుంచి ఈ నెల 5న వర్కింగ్ అరేంజ్‌మెంట్స్ పేరిట జిల్లాలకు డీఎంవోలను నియమించారు. నిజామాబాద్ డీఎంవోలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఉద్యోగుల్లో ఆదిలాబాద్‌కు ఎస్ఎంఏ హోదా కలిగిన వై.గజానంద్‌ను, కుమురంభీం ఆసిఫాబాద్‌కు సీనియర్ అసిస్టెంట్ హోదా కలిగిన సయ్యద్ అశ్వాక్ అహ్మద్‌ను, రాజన్న సిరిసిల్ల జిల్లా డీఎంవో కార్యాలయం నుంచి ఎస్ఎంఏ హోదా కలిగిన ఎండీ షాబొద్దీన్‌కు మంచిర్యాల డీఎంవోలుగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. తాజాగా వారు బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు కుర్చీ ఆటకు తెరపడింది.

ఒకే అధికారి.. బహుముఖ పాత్ర..
'పేరు గొప్ప.. ఊరు దిబ్బ' అన్నట్లు ఉంది మార్కెటింగ్ శాఖ పరిస్థితి. జిల్లాల విభజనకు ముందు ఆదిలాబాద్ కేంద్రంగా మార్కెటింగ్ జేడీ కార్యాలయం కొనసాగింది. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఇదే కార్యాలయం నుంచి నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు ఉద్యోగులను సర్దుబాటు చేశారు. ప్రస్తుతం ఈ శాఖలో పరిస్థితి గమనిస్తే.. ఆదిలాబాద్‌లో డీఎంవోతోపాటు ఓ జూనియర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేటర్, నిర్మల్‌లో డీఎంవోతోపాటు ఒక రికార్డ్ అసిస్టెంట్, మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్‌లో డీఎంవోలు మినహాయిస్తే మరో పోస్టు లేని పరిస్థితి. దీంతో రికార్డు తయారు చేయాలన్నా జిల్లా సమావేశాల్లో పాల్గొనాలన్నా ఒకేఒక అధికారి బహుముఖ పాత్ర నిర్వర్తించాల్సిన పరిస్థితి.

పోలీస్.. సక్సెస్..

- జిల్లాలో ప్రశాంతంగా వినాయక ఉత్సవాలు
- నెల ముందు నుంచే ప్రణాళిక..
- పక్షం రోజులపాటు అప్రమత్తం
- ఐదురోజులు రోడ్లపైనే విధులు..


నిర్మల్‌లో వినాయక నిమజ్జనం సందర్భంగా బందోబస్తు విధుల్లో పోలీసులు

నిర్మల్: రాష్ట్రంలోనే సున్నిత ప్రాంతంగా పేరున్న నిర్మల్ జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కత్తిమీద సాము లాంటిదే. ఎలాంటి ఘటనలకు తావివ్వకుండా, అన్నివర్గాలనూ సంతృప్తిపరుస్తూ, ప్రశాంతంగా ఉత్సవాలను ముగించడం పోలీసులకు పెద్ద టాస్క్. జిల్లాకు కొత్తగా వచ్చిన ఎస్పీ జానకీషర్మిల ఈ టాస్క్‌ను సక్సెస్‌ఫుల్‌గా పూర్తి చేశారు. వినాయక చవితి నుంచి నిమజ్జనోత్సవం వరకు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. ఉత్సవాల్లో ప్రజలతో కలిసిపోతూ.. అన్నివర్గాలతో భేష్.. అనిపించుకున్నారు. ప్రశాంతంగా ఉత్సవాలు పూర్తికావడంతో పోలీసులపై ప్రశంసలు కురుస్తున్నాయి.

నెల ముందు నుంచే..
జిల్లాలో గణేశ్ ఉత్సవాల కోసం నెల ముందు నుంచే పోలీసులు తమ పనులు మొదలు పెట్టారు. ఏ ప్రాంతంలో ఎన్నిరోజులు నిర్వహిస్తారు, ఎక్కడెక్కడ ఎలాంటి పరిస్థితులు ఉన్నాయనే విషయాలతోపాటు ఈసారి స్థానిక సెంటిమెంట్లపైనా ఎస్పీ దృష్టిపెట్టారు. అందుకు తగ్గట్లు పోలీసు అధికారులు, సిబ్బందిని సన్నద్ధం చేశారు. గతంలో జిల్లాలో చోటుచేసుకున్న ఘటనలను దృష్టిలో పెట్టుకుని శాంతికమిటీ సమావేశాలు నిర్వహించారు. స్థానిక గణేశ్ మండళ్లు, ఉత్సవ కమిటీలతోనూ భేటీలు పెట్టారు. రౌడీషీట్ ఉన్నవారు, గతంలో వివాదాస్పదంగా వ్యవహరించిన వారిపైనా దృష్టిపెట్టారు. ఉత్సవాలను ప్రశాంతంగా ముగించేందుకు అందరినీ కలుపుకుని వెళ్లారు.

అనుక్షణం అప్రమత్తంగా..
వినాయక ఉత్సవాల సమయంలో చిన్నపాటి ఘర్షణ జిల్లాలో పెద్ద గొడవలు, కర్ఫ్యూల వరకు దారితీసిన సందర్భాలు ఉన్నాయి. ఈక్రమంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనకు తావివ్వకుండా పోలీసుశాఖ జాగ్రత్త పడింది. శాఖాపరంగా ప్రతీ గణపతి వద్ద 24 గంటలు కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించారు. ఉదయం, రాత్రివేళల్లో పర్యవేక్షణతోపాటు ప్రతీ గణేశ్ మండపం వద్దకు పోలీసులు అధికారులు గస్తీ తిరిగారు. ఘర్షణలు తలెత్తే అవకాశం ఉన్నచోటా ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. ఎస్పీ స్వయంగా వెళ్లి పర్యవేక్షించారు.

రోజుల తరబడి.. రోడ్లపైనే..
వినాయక నవరాత్రులన్నీ ఒక ఎత్తయితే.. నిమజ్జనోత్సవం ఒక్క ఎత్తుగా ఉంటుంది. నిమజ్జనోత్సవం ప్రశాంతంగా ముగించడంలో రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్ ఇలా పలుశాఖలతోపాటు పోలీసులు కీలకంగా వ్యవహరించారు. భైంసాతోపాటు నిర్మల్‌లో శోభాయాత్ర, నిమజ్జనం ప్రశాంతంగా పూర్తిచేయడంలో విజయవంతమయ్యారు. ఇందుకోసం పోలీసు సిబ్బందితోపాటు అధికారులూ రోజుల తరబడి రోడ్లపైనే విధులు నిర్వహించారు. 9వ రోజు భైంసాలో.. 11వ రోజు నిర్మల్‌లో నిమజ్జనం జరిగింది. దీంతో విరామం లేకుండా విధుల్లో నిమగ్నమయ్యారు. ఎస్పీ జానకీషర్మిల స్థానిక పరిస్థితులను తెలుసుకుంటూ ప్రజలతో మమేకమవుతూ శోభాయాత్రను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంలో విజయవంతమయ్యారు. ఈనేపథ్యంలో పలు గణేశ్ ఉత్సవ కమిటీలు, మండళ్లవారు, శాంతికమిటీలు ఎస్పీసహా పోలీసు అధికారులను సన్మానిస్తున్నారు.

సిబ్బందికి సెల్యూట్..



వారంరోజులు కంటిమీద కునుకు లేకుండా గణేశ్ ఉత్సవ బందోబస్తులో పాల్గొన్న జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందికి నా సెల్యూట్. భైంసా, ముధోల్, నిర్మల్, ఖానాపూర్ ప్రాంతాలలో ప్రశాంతంగా నిమజ్జనం పూర్తి చేశాం. వరుస నిమజ్జనాలతో వారం రోజులు పోలీసులు అవిశ్రాంతంగా విధులు నిర్వహించారు. క్షేత్రస్థాయిలో కష్టపడిన సిబ్బందికి అభినందనలు. రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖలను సమన్వయం చేసుకుంటూ సమష్టిగా ఉత్సవాలు పూర్తి చేశాం.
– జానకీ షర్మిల, ఎస్పీ


ఎస్పీకి సన్మానం


ఎస్పీ జానకీషర్మిలను సన్మానిస్తున్న ముధోల్ ఉత్సవ కమిటీ సభ్యులు

నిర్మల్: వినాయక నవరాత్రులతోపాటు నిమజ్జనోత్సవం ప్రశాతంగా ముగిసేలా పటిష్ట చర్యలు చేపట్టిన ఎస్పీ జానకీ షర్మిలను ముధోల్ హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు గురువారం సన్మానించారు. ఎస్పీ కార్యాలయంలో కలిసి ధన్యవాదాలు తెలిపారు. భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్, టౌన్ సీఐ రాజారెడ్డి తదితరులనూ ఉత్సవ కమిటీ సభ్యులు సన్మానించారు. ఇందులో హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రోల్ల రమేశ్, గౌరవ అధ్యక్షుడు ధర్మపురి సుదర్శన్, వీడీసీ అధ్యక్షుడు గుంజల నారాయణ, కోశాధికారి మేత్రి సాయినాథ్, ఉపాధ్యక్షులు వరగంటి జీవన్, తాటివార్ రమేశ్, కోరి పోతన్న, దేవోజీ భూమేష్, పెద్దకర్రోళ్ల మోహన్, జంబూల సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మ మార్గాన్ని బోధించిన ప్రవక్త

- డీఎస్పీ గంగారెడ్డి


మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: దయ, ధర్మ మార్గాన్ని బోధించిన మహనీయుడు మహమ్మద్ ప్రవక్త అని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా జిల్లా కేంద్రంలో ముస్లింలు గురువారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. ఇస్లాం మత స్థాపకులు మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజును మిలాద్ ఉల్ నబీ అని అంటారన్నారు. అన్ని సామాజికవర్గాల వారు సూచించిన సూచనలను ఆదేశాలను పాటించినప్పుడే జీవితం సుఖశాంతులతో సాగుతుందని పేర్కొన్నారు. ఆదర్శ మార్గాలను ప్రపంచానికి బోధించిన ఆదర్శమూర్తి ప్రవక్త అని తెలిపారు. ఈ సందర్భంగా ముస్లింలకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, కమిటీ సభ్యులు మహమ్మద్ ఇసాక్ అలీ, సహాబ్, మౌలానా సయ్యద్ అన్వర్, సయ్యద్ మసూద్, సయ్యద్ అమీన్ బాబా, మహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


శ్రమదానం చేస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

మామడ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివా స్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మినీ గురుకులంలలో గురువారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శ్రమదానం చేశారు. మినీ గురుకులం విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు శ్రమదానం చేయడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగాసాగర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంట్లో భారీ చోరీ

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణం లోని పంజేషా మొహల్లాలో గల ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. బాధితుడు బి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం..ఈనెల 14న ఆ స్పత్రి పని నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌కు వెళ్లారు. గురువారం ఉదయం వచ్చి చూడగా ఇంటితాళం పగు లగొట్టి ఉంది. ఇంట్లో ఉన్న 10 తులాల బంగారం, 60 గ్రాముల వెండితో పాటు రూ.35 వేల నగదు, 50 ఇంచుల టీవీని దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో డయల్ 100 కు సమాచారం అందించారు. కింది పోర్షన్ లో అంగన్‌వాడీ కేంద్రం తాళం సైతం పగు లగొట్టగా అందులో ఎలాంటి వస్తువులు చోరీకి గురికాలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పులిమ డుగు శివారులో ఉన్న పంట పొలాల్లో గు రువారం అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై మనోహర్ తెలిపా రు. మృతుడు సాలెవాడకే పంచాయతీ పరి ధిలో ఉన్న సోముగూడకు చెందిన కోరింగ రాము (52)గా గుర్తించినట్లు ఆయన పేర్కొన్నారు. పొదల మధ్య గాయాలతో ఉండడంతో అనుమానం కలుగుతోందని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

టిప్పర్ ఢీకొని యువకుడు..


టిప్పర్ టైర్ల కింద మృతదేహం

తలమడుగు: టిప్పర్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం మండలంలోని మందగూ డకు చెందిన మేస్రం మహేందర్ (23) గురువారం ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ నుంచి మందగూడకు వెళ్తుండ గా కప్పర్‌దేవి గ్రామ ఎక్స్‌రోడ్డు సమీపం లో రోడ్డు పనులు చేపడుతున్న టిప్పర్ వెనుక నుంచి వచ్చి ఢీకొట్టింది. దీంతో మహేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదిలాబాద్ సీఐ ఫణిందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతు న్నట్లు ఎస్సై అంజమ్మ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..


మృతి చెందిన చాంద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి శివారు తిరుమల హిల్స్ నేషనల్ హైవేపై బుధ వారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ దేవయ్య తెలిపారు. రాత్రి 10.30 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కుము రంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రానికి చెందిన ఎస్‌కే.చాంద్(58) చనిపోయాడని పేర్కొన్నారు. మృతుడి కొడుకు సాధిక్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ సింగరేణి కార్మికుడు..

బెల్లంపల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రెండు నెలలపాటు మృత్యువుతో పోరాడిన సింగరేణి యువ కార్మికుడు మృతిచెందాడు. తాళ్లగురిజాల ఎస్సై సీహెచ్.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... మాలగురిజాల గ్రామానికి చెం దిన గోమాస శివప్రసాద్(22) కాసిపేట-2 గనిలో కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తు న్నాడు. జూలై 3న రాత్రి పూట విధులకు హాజరయ్యేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా తాళ్లగురిజాల గ్రామ శివారు లోని మూల మలుపు వద్ద అదుపుతప్పి కిం ద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలైన అత డిని కుటుంబీకులు చికిత్స కోసం కరీంనగ ర్‌కు, మెరుగైన వైద్య చికిత్స కోసం హైద రాబాద్‌కు తరలించారు. చికిత్స పొందు తూ పరిస్థితి విషమించి శివప్రసాద్ బుధ వారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి తల్లి గోమాస రంజిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'సంఘ వ్యతిరేక చర్యలను ఉపేక్షించొద్దు'

చెన్నూర్: చెన్నూర్ నియోజకవర్గంలో సం ఘ వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారిని ఉపేక్షించవద్దని, పోలీసులు చట్ట ప్రకారం శిక్షించాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. తన అనారోగ్య కారణాలతో చెన్నూర్ శనిగకుంటను సంద ర్శించలేకపోయానని తెలిపారు. మత్తడిని డిటోనేటర్లు పెట్టి పేల్చేసిన వారిని పట్టు కొని కఠినంగా శిక్షించాలని తెలిపారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా పెట్రో లింగ్ నిర్వహించి అసాంఘిక కార్యకలపా లను అరికట్టాలని పోలీసులకు సూచిం చారు. సంఘ విద్రోహక చర్యలకు పాల్పడిన వారికి చట్టపరమైన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

వలస గోస తీరేలా..

- గల్ఫ్ బాధిత కుటుంబాలకు భరోసా
- ఎడారి దేశాల్లో మృతిచెందితే రూ.5 లక్షల పరిహారం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉమ్మడి జిల్లా వలస కార్మిక కుటుంబాలు


ఇటీవలి సమావేశంలో ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్‌తో జిల్లా కాంగ్రెస్ నాయకులు, గల్ఫ్ సంఘాల నాయకులు(ఫైల్)

నిర్మల్‌ఖిల్లా:ఎన్నో ఏళ్లుగా మారని కథ.. తీరనివ్యథ గల్ఫ్ కార్మికుల పరిస్థితి. బతుకుదెరువు కోసం ఉన్న ఊరిని, కన్నవారిని విడిచి ఎడారి దేశాల బాట పడు తున్న వారికి, వారి కుటుంబీకులకు ఎట్టకేలకు భరోసా లభించింది. గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి వివిధ సంఘాలు, రాజకీయ పార్టీలు ఎన్నో ఏళ్లుగా ప్రయత్నం చేస్తూనే ఉన్నాయి. ఎట్టకే లకు గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. అనేక సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడమే కాకుండా, గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించింది. బాధిత కుటుబాలకు రూ.5 లక్షల ప రిహారం ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరు జీవో 205 జారీ చేసింది. 2023 డిసెంబర 7 నుంచి దీని ని అమలు చేయాలని నిర్ణయించింది. ఇక గల్ఫ్ కా ర్మికుల జీవనస్థితిగతుల అధ్యాయానికి కూడా సలహా కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుతం ప్రజాభవన్‌లో కొనసాగుతున్న ప్రజా వాణి కార్యక్రమంలో ప్రత్యేకంగా గల్ఫ్ కార్మికుల కుటుంబాల సమస్యలు తెలుసుకునేందుకు ప్రవాసీ ప్రజావాణి కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడిం చింది. గల్ఫ్ కార్మికుల కుటుంబాల పిల్లలకు గురు కులాల్లో సీట్లు కేటాయించాలని నిర్ణయించింది.

గల్ఫ్ కార్మిక కుటుంబాల హర్షం...

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గల్ఫ్ కార్మికుల కుటుం బాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి దాదాపు 60 వేల మంది ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లొస్తున్నారు. వారిపై ఆధారపడిన కుటుంబీకులు లక్ష మందికిపైగా ఉన్నారు. కేరళ తరహాలో ప్రవాసీ సంక్షేమ(ఎన్నారై పాలసీ) విధానాన్ని అమలు చేయాలని కార్మిక సం ఘాలు ఏళ్లుగా కోరుతున్నాయి. కానీ గత ప్రభుత్వా లు పట్టించుకోలేదు. గల్ఫ్ దేశాల్లో ఉపాధి పొందు తున్న కార్మికులు ఏటా వివిధ కారణాలతో అక్కడే మత్యువాత పడుతున్నారు. ఏటా ఉమ్మడి జిల్లాకు చెందినవారు పదుల సంఖ్యలో విగత జీవులుగా స్వగ్రామాలకు వస్తున్నారు. ఇలాంటి దయనీయ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్‌దేశాల్లో మృతి చెం దిన వారి కుటుంబీకులకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని నిర్ణయించడం ద్వారా బాధిత కుటుం బాలకు ఆర్థిక సాంత్వన చేకూరుతుంది.

కష్టాలు తీరుతాయి..



రాష్ట్ర ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల కుటుంబాల కోసం పలు నిర్ణయాలను ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయం. గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం అధ్యయన కమిటీ, మృతుల కుటుంబీకు లకు రూ. 5 లక్షల పరిహారం చెల్లించేందుకు నిర్ణయించడం అభినందనీయం. దీంతో బాధి తుల కష్టాలు తీరుతాయి.

– దొనికెన కృష్ణ, గల్ఫ్ జేఏసీ రాష్ట్ర నాయకుడు

హామీ నిలబెట్టుకున్నారు..



కార్మికుల సంక్షేమానికి కట్టు బడి ఉంటామని గత అసెం బ్లీ ఎన్నికలకు ముందు కాం గ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. దానిని నెరవేర్చేదిశగా ఉత్త ర్వులు ఇచ్చింది. ఈ నిర్ణ యాలతో కార్మికుల కుటుంబాలకు న్యాయం జరుగుతుంది. ఉమ్మడి జిల్లాకు చెందిన వలస కార్మికల కుటుంబాలకు ప్రయోజనం కలుగుతుంది.

– స్వదేశ్ పరికిపండ్ల, ప్రవాసీమిత్ర కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు

డిపాజిట్‌పై వ్యాపారుల వెనుకంజ

- కూరగాయల స్టాల్స్‌కు ముందుకు రాని వ్యాపారులు
- ధరావత్ తగ్గించాలని డిమాండ్
- ఇప్పటికే తగ్గించిన మున్సిపాల్టీ


కూరగాయల మార్కెట్‌లోని స్టాల్స్

బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలోని సమీకృత కూర గాయల మార్కెట్ నిర్మించినా నిష్ప్రయోజనమే అవుతోంది. కాంటా చౌరస్తా నుంచి బెల్లంపల్లి బస్తీకి వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన రూ.7కోట్ల అం చనా వ్యయంతో మార్కెట్ నిర్మాణం చేపట్టారు. జీ ప్లస్ వన్ తరహాలో నిర్మించాల్సి ఉండగా.. ప్రస్తుతం గ్రౌండ్‌ఫ్లోర్‌లో 105 స్టాల్స్ పూర్తయ్యాయి. పై అం తస్తు పనులు తుది దశలో ఉన్నాయి. ఇప్పటివరకు వ్యాపారులు కాంటా చౌరస్తాలో, బెల్లంపల్లి బస్తీకి వెళ్లే రోడ్డుకు ఇరువైపుల, కాంటా చౌరస్తా నుంచి భగత్‌సింగ్ విగ్రహం వరకు ప్రధాన రహదారి పక్కన కూరగాయలు విక్రయిస్తున్నారు. వర్షంలో తడుస్తూ, ఎండకు ఎండుతూ, చలికి వణుకుతూ, దుమ్ము, ధూళిలో వ్యాపారులు, కొనుగోలుదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పక్షం రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్, కలెక్టర్ కుమా ర్‌దీపక్ లాటరీ ద్వారా స్టాల్స్‌ను వ్యాపారులకు కేటాయించారు. స్టాల్ దక్కించుకున్న వ్యాపారులు రూ.20వేలు డిపాజిట్, ప్రతీ నెల రూ.2వేలు అద్దె చెల్లించాలని మున్సిపల్ పాలకవర్గం నిర్ణయించిం ది. వ్యాపారుల ఆర్థిక స్థితిగతులను తెలుసుకోకుం డా, అభిప్రాయాలు సేకరించకుండా ఏకపక్షంగా తీర్మానం చేశారనే విమర్శలున్నాయి. దీంతో వ్యాపా రులు డిపాజిట్ చెల్లింపులు చేయడానికి వెనుకంజ వేస్తుండడంతో చిక్కుముడి పడింది.

ఓ మెట్టు దిగి తగ్గించినా

పాలక, అధికార వర్గం ఓ మెట్టు దిగి స్టాల్స్ డిపా జిట్ రుసుంను సవరించారు. డిపాజిట్‌ను రూ.10వే లకు కుదించినా వ్యాపారుల నుంచి సానుకూలత వ్యక్తం కావడం లేదు. 105స్టాల్స్‌కు గాను గురు వారం వరకు 28 మంది మాత్రమే డిపాజిట్ చెల్లిం చినట్లు తెలుస్తోంది. మెజార్టీ వ్యాపారులు వెనుకం జతో మున్సిపల్ అధికారులు, పాలకవర్గం తర్జన భర్జన పడుతున్నారు. మరోవైపు వ్యాపారులు డిపా జిట్ మరింత తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎమ్మెల్యేను కలిసి విజ్ఞప్తి చేశారు. నిర్దేశించిన ప్రకారంగా డిపాజిట్ చెల్లించి, రూ.100 విలువైన బాండ్ పేపర్‌పై అగ్రిమెంట్ చేసుకోవాలని సూచిస్తున్నా వ్యాపారుల్లో ఉలుకూ పలుకు లేదు.

గడువు పెంచే అవకాశాలు ఉన్నాయి..



స్టాల్స్ డిపాజిట్ రూ.10 వేల నుం చి రూ.5వేలకు తగ్గించాలని వ్యాపారులు కోరుతున్నారు. ఇప్పటికే రూ.20 వేల నుంచి రూ.10 వేలకు కుదించాం. ఇంకా డిపా జిట్‌ను తగ్గించడం సాధ్యం కాదు. కొంత గడువు కావాలని కొందరు వ్యాపారులు అడుగుతున్నారు. సమస్య తీవ్రతను ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్లి డిపాజిట్ రుసుం చెల్లించే గడువును మరి కొద్దిరోజులు పొడిగించడానికి ప్రయత్నా లు చేస్తున్నాం.

– కే.శ్రీనివాస రావు, మున్సిపల్ కమిషనర్, బెల్లంపల్లి

మాజీ జెడ్పీటీసీ, మరొకరిపై కేసు


నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ నరేందర్

లక్సెట్టిపేట: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య, హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన నక్క ముజ్జన్నపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాం డ్‌కు తరలించారు. గురువారం స్థానిక సీఐ నరేంద ర్, ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ముజ్జన్నకు మండలంలోని బలరావుపేట గ్రామ శివారులో వ్యవసాయ భూమి ఉంది. ముజ్జన్న తోపాటు గ్రామానికి చెందిన బెడద బసవయ్య మట్టి రోడ్డును ఆక్రమించి సాగు చేస్తున్నారు. దీంతో అవతలి పొలాలకు వెళ్లే వ్యక్తులకు దారి ఇబ్బందిగా మారడంతో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారుల సూచన మేరకు బసవయ్య దారి ఇచ్చేందుకు అంగీకరించగా, ముజ్జన్న నిరాక రించాడు. పక్కన భూమి ఉన్న ముత్తె సత్తయ్య సూచన మేరకు జూలై 31న ముజ్జన్న రోడ్డుకు అడ్డం గా విద్యుత్ వైర్లు అమర్చాడు. దీంతో గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విఠల్

బెజ్జూర్(సిర్పూర్): మండల కేంద్రానికి చెందిన గుమ్ముల శంకర్ ఇల్లు బుధవారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరే గాయి. శంకర్ కుమారుడు శ్రీనివాస్ గమినించి కుటుంబ సభ్యులను అప్రమత్తం చేశాడు. అందరూ బయటికి వచ్చి విద్యుత్‌శాఖ అధికారులకు సమా చారం అందించారు. వారు విద్యుత్ సరఫరా నిలిపి వేయడంతో ప్రమాదం తప్పింది. ఇంట్లో ఉన్న మూడు తులల బంగారు ఆభరణాలు, వెండి, ఫ్రిజ్, కూలర్, మంచాలు మంటలకు బూడిదయ్యా యని, మొత్తం రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు. రెవెన్యూ అధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి ఆస్తినష్టం అంచనా వేశారు. కాగా.. గుమ్ముల శంకర్‌కుటుం బాన్ని ఎమ్మెల్సీ దండె విఠల్ పరామర్శించారు. రూ.10వేల ఆర్థికసాయం అందించారు. నాయకు లు అర్షద్‌హుస్సేన్, రాచకొండ శ్రీవర్ధన్, పెద్దల శం కర్, షణ్ముఖ తదితరులు ఉన్నారు.

నలుగురు తహసీల్దార్లకు పోస్టింగ్

- మరో ముగ్గురికి స్థానచలనం

కైలాస్‌నగర్: వివిధ జిల్లాల్లో నాయబ్ తహసీల్దార్లు గా పనిచేస్తూ పదోన్నతిపై ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించబడ్డ ముగ్గురు తహసీల్దార్లతో పాటు ఇతర జిల్లాల నుంచి బదిలీపై వచ్చిన మరో తహ సీల్దార్‌కు పోస్టింగ్‌లను కేటాయిస్తూ జిల్లా రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ శ్యామలా దేవి గురువారం ఉత్త ర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో పనిచే స్తున్న మరో ముగ్గురికి స్థానచలనం కల్పించారు. వీరంతా తక్షణమే తమ విధుల్లో చేరాలని ఉత్వర్యు ల్లో స్పష్టం చేశారు.

తహసీల్దార్	ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతం	పోస్టింగ్ మండలం
జి.పంచపూల	నాయబ్ తహసీల్దార్, నిర్మల్	కలెక్టరేట్ సూపరింటెండెంట్
కె.రఘునాథ్‌రావు	నాయబ్ తహసీల్దార్, ఆసిఫాబాద్	బేల
బి.గోవింద్	నాయబ్ తహసీల్దార్, మంచిర్యాల	ఆదిలాబాద్‌రూరల్
ఎం.శైలజ	తహసీల్దార్, మహబూబాబాద్	కలెక్టరేట్ సూపరింటెండెంట్
కె.నలంద ప్రియా	కలెక్టరేట్ సూపరింటెండెంట్	తహసీల్దార్, భీంపూర్
సీహెచ్.సత్యనారాయణ	తహసీల్దార్, భీంపూర్	తహసీల్దార్, ఇచ్చోడ
జి.తుకారాం	తహసీల్దార్, ఇచ్చోడ	తహసీల్దార్, సిరికొండ

ఆరోగ్యశ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆరోగ్యశ్రీ ఉద్యోగులు

నిర్మల్‌చైన్‌గేట్: ఆరోగ్యశ్రీ ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌కు ఆరోగ్య మిత్రలు గురు వారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరోగ్యమిత్రలకు డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ క్యాడర్ కల్పించాలని, జీవో 60 ప్రకారం వేతనం రూ.22,750 ఇవ్వాలని కోరారు. ఆరోగ్య మిత్రల జీతభత్యాలు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా కాకుండా ట్రస్ట్ ద్వారా చెల్లించి కాంట్రాక్ట్ విధానంలోకి మార్చాలన్నారు. రాబోయే పీఆర్సీలో కనీస వేతనం రూ.35 వేలకు పెంచాలని, టీఏ, డీఏ సౌకర్యం కల్పించాలన్నారు. షఫ్టింగ్ విధానం రద్దు చేయాలన్నారు. 16 ఏళ్లుగా పీహెచ్‌సీలలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యమిత్రలను తిరిగి పీహెచ్‌సీలో పనిచేసేలా నియమించాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీలో ఖాళీ పోస్టులను భర్తీ చేసి, సీనియా రిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. విధి నిర్వ హణలో మరణించిన ఉద్యోగి కుటుంబానికి ప్రభు త్వం ఎక్స్ గ్రేషియా చెల్లించాలని కోరారు. ఉద్యోగు లందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో సీఐటీయూ జిల్లా సెక్రెటరీ సురేష్, ఆరోగ్యమిత్రలు స్వప్న, కల్పన, అశ్విని, రజిత, విజయలక్ష్మి, ప్రవీణ్‌రెడ్డి, ముఖేష్ పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

ఆదిలాబాద్‌టౌన్: తల్లి మందలించిందని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకా జమున నగర్ సిండికేట్‌కు చెందిన గజానన్ కాన్షీరాం జాదవ్ (23) బుధవారం సాయంత్రం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కిరాణ సామగ్రి తీసుకురావాలని తల్లి మందలించడం తో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడి నట్లు ఏఎస్సై తెలిపారు.

ఎస్పీఎం ఉద్యోగి..

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని లారీ చౌర స్తాకు చెందిన ఎస్పీఎం ఉద్యోగి గుండు తిరుప తి(55) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన తిరు పతి గతంలో పక్షవాతానికి గురయ్యాడు. మద్యానికి బానిసై అతడు జీవితంపై విరక్తి చెం ది ఇంట్లో ఎవరూలేని సమయంలో బుధ వారం రాత్రి పురుగుల మందు తాగాడు. కరీం నగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువా రం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతు డి కుమారుడు సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

మెప్మా ఉద్యోగి..


ఇండ్ల రమేశ్(ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల శివారులో మెప్మా కార్యా లయ జూనియర్ అసిస్టెం ట్ ఇండ్ల రమేశ్(40) ఆత్మ హత్య చేసుకున్నాడు. వివ రాలిలా ఉన్నాయి. లక్సెట్టి పేట మండలం వెంకటరావుపేట గ్రామానికి చెందిన రమేశ్ మంచిర్యాల రాంనగర్‌లో నివాసం ఉంటున్నాడు. మంచిర్యాల మున్సిపా ల్టీలోని మెప్మా పీడీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్(డాటా ఎంట్రీ ఆపరేటర్)గా పని చేస్తున్నాడు. గత నెల రోజులుగా మానసిక పరిస్థితి బాగా లేకపోవడం, కుటుంబ కలహాల తో విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. గురువారం ముల్కల్ల శివారులోని కల ్వర్టు వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరాడు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా విగత జీవిగా కనిపించాడు. మృతుడికి భార్య శిరీష, కుమార్తె ఉన్నారు. మృతుడి సోదరుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. కాగా, పేస్కేలు ఉత్తర్వులు వచ్చి ఏడాది గడి చినా అమలులో ఆటంకాలు ఉన్నాయని, కొం దరు యూనియన్ నాయకులు ఆపేందుకు ప్రయత్నాలు చేశారని, జీతాలు పెరగవు, ఏరియర్స్ రావు, చాలీచాలని జీతంతో బత కడం తన వల్ల కాదని ఇటీవల ఆవేదన వ్యక్తం చేసినట్లు తోటి ఉద్యోగులు తెలిపారు.

'వార్షికోత్సవాలు జయప్రదం చేయండి'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఈ నెల 21 నుంచి అక్టోబర్ 20వరకు నిర్వహించనున్న సీపీఐ మావోయిస్టు 20వ సంస్థాపనా వార్షికోత్సవాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ గురువారం పత్రికలకు విడుదల చేసిన లేఖలో పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు సాగిస్తున్న ఆపరేషన్ కగార్‌ను తిప్పి కొట్టాలని, పార్టీని, విప్లవోద్యమాన్ని కాపాడు కుంటూ లొంగుబాటు, విప్లవ ద్రోహాలను వ్యతిరేకిద్దామని పేర్కొన్నారు. విప్లవోద్యమా న్ని అన్నిరంగాలకు విస్తరిద్దామని పేర్కొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా


విద్యార్థులతో మాట్లాడుతున్న పీవో

ఇంద్రవెల్లి: ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యా ర్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. గురువారం మండలం లోని వడగామ్ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనం పై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువల గల ఆహారం అందించాలన్నారు. సబ్జె క్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధించారు. సబ్జె క్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. వసతి గృహాల్లో ఎలాంటి సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

పెరోల్‌పై వచ్చి ఆటో చోరీ

- రెండేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న ఖైదీ
- పట్టుకున్న టూటౌన్ పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: పోక్సో కేసులో శిక్ష అనుభవిస్తున్న ఖైదీని టూటౌన్ పోలీసులు పట్టుకున్నట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. గురు వారం రాత్రి ఆదిలాబాద్ టూటౌన్ పోలీసు స్టేషన్ లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిం చారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఛోట తలాబ్‌కు చెందిన డ్రైవర్ సయ్యద్ అలీమ్ 2016లో బాలికపై అత్యాచారం కేసులో పదేళ్ల జైలుశిక్ష అనుభవిస్తు న్నాడు. 2019లో పోక్సో కోర్టు పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించింది. నిజామా బాద్ జైలులో శిక్ష అనుభవిస్తుండగా 2022 అక్టోబర్ 22న 30 రోజుల పాటు పెరోల్‌పై బయటకు వచ్చాడు. ఆ తర్వాత దరఖాస్తు చేసి మరో 10 రోజులు పొడిగించుకున్నాడు. 2022 డిసెంబర్ 7న తిరిగి జైలుకు వెళ్లాల్సి ఉండగా తప్పించుకుని తిరు గుతున్నాడు. దీంతో నిజామాబాద్ జైలు సూపరిం టెండెంట్ 2024 జనవరిలో బోధన్ పోలీసు స్టేషన్ లో కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఈనెల 17న జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన మహ్మద్ అవేజ్ ఆటోను దొంగిలించాడు. దీంతో బాధితుడు గురువారం ఉదయం టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసు కున్న పోలీసులు 24 గంటల్లోపే ఆదిలాబాద్ పట్టణంలోని సీడబ్ల్యూసీ గోదాం వద్ద ఆటోతో పాటు ఖైదీని పట్టుకున్నారు. విచారించగా వివ రాలు వెల్లడించాడు. కాగా ఖైదీపై ఇదివరకు గుడి హత్నూర్, లింగాపూర్, బోధన్ పోలీసు స్టేషన్‌లలో ఒక్కో కేసు, ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో రెండు కేసులు నమోదై ఉన్నట్లు పేర్కొన్నారు. నిం దితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరిం చిన ఆదిలాబాద్ టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు, ఎస్సై విష్ణువర్ధన్, ఐడీ పార్టీ కానిస్టేబుల్ రమేశ్‌ను డీఎస్పీ అభినందించారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి


మాట్లాడుతున్న టి.లింగారెడ్డి

నిర్మల్ రూరల్:దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఉపాధ్యాయులు, ఉద్యోగుల పెండింగ్ బిల్లులు, నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి డిమాండ్ చేశారు. డ్యాంగాపూర్ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల, కస్బా బాలికల ఆశ్రమ పాఠశాల, ,ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, మంజులాపూర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలం నుంచి పెండిం గ్‌లో ఉన్న నేటికీ చెల్లించలేదని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నాలుగు డీఏలు పెండింగు లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయా లని కోరారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి సత్వరమే ఖాళీ పోస్టులు భర్తీ చేయాల న్నారు. పీఆర్సీ గడువు ముగిసి 15 నెలలు కావ స్తున్నా కమిషన్ నుంచి రిపోర్ట్ స్వీకరించడం లేదని తెలిపారు. ఈనెల 24 హైదరాబాద్‌లోని సుంద రయ్య విజ్ఞాన కేంద్రంలో ఉద్యోగులు, ఉపాధ్యా యులు, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఇందులో డీటీ ఎఫ్ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు యస్.మహేంద్రాచారి, ప్రధాన కార్యదర్శి చంద్రనాగకాంత్, కార్యదర్శి ఆర్.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఔషధాల ప్రభావంపై అవగాహన

మంచిర్యాలటౌన్: ఔషధ భద్రత వారోత్సవాల సం దర్భంగా స్థానిక ప్రభుత్వ మెడిక ల్ కళాశాల విద్యా ర్థులు గురువారం అవగా హన ర్యాలీ నిర్వహిం చారు. కళాశాల నుంచి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వరకు ర్యాలీ సాగింది. ఔషధాలతో ఎలాంటి దుష్ప్రభా వాలు వచ్చే అవకాశం ఉంటుందో ఆస్ప త్రి కి వచ్చిన వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫార్మకాలజీ హెచ్‌వోడీ ప్రొఫెసర్ జగతి, మెడికల్ కాలేజీ ప్రిన్సి పాల్ డాక్టర్ సులే మాన్, సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్‌చంద్రారెడ్డి, డాక్టర్ మనో జ్, డాక్టర్ సత్యేంద్ర, ప్రొఫెసర్లు, అసి స్టెంట్ ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోలార్ ప్లేట్ల దొంగల అరెస్టు

కోటపల్లి: మండలంలోని వెలమపల్లి గ్రామానికి చెందిన గుర్రం సురేశ్ పత్తి చేనులో సోలార్ పేట్లు, బ్యాటరీ దొంగిలించిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కోటపల్లి ఎస్సై రాజేందర్ తెలిపారు. సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో పానెం సూర్యకిరణ్, రాజేందర్, మనోజ్ చేనులోని సోలార్‌ప్లేట్లు, బ్యాటరీ దొంగిలించారని పేర్కొ న్నారు. సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశా మని తెలిపారు. లక్ష్మీపూర్ గ్రామం వద్ద వాహనాలు తనిఖీ చేస్తూ అదుపులోకి తీసుకుని విచారణ చేయ గా నేరం అంగీకరించారని తెలిపారు.